# గుండె చెరువైంది

నారాయుడు వచ్చి కృష్ణ గట్టు మీద నిలబడ్డాడు. పదేళ్ళ పసివాడైనా, వాడి మనసులో అగ్ని పర్వతాలు రగులుతున్నాయి. లావాలు ప్రవహిస్తున్నాయి. స్నానాల రేవులోకి దిగి మెట్ల మీద కూర్చున్నాడు కృష్ణలో నీరేమీ లేదు. అంతా వట్టి ఇసుకపఱ్ఱ. బారేజికి అవతల నీరంతా బంధించి ఉండటంతో కృష్ణలంకవైపు అక్కడక్కడ నీటి పాయలు మాత్రం నిశ్చలంగా నిలబడి ఉన్నాయి. గుండెలు ఎండిపోయిన తల్లి దగ్గరికి వచ్చి పాలకోసం తడుముకుంటున్న పసిపాపలా నారాయుడు చల్లని వోదార్పు కోసం అక్కడికి వచ్చాడు.

నారాయుడు చేతిలో సీసా ఉంది. ఆలోచిస్తూ అప్పుడప్పుడు దాన్ని చూస్తూ, తన నెవరైనా చూస్తున్నారేమోనని దిక్కులు చూస్తున్నాడు. ఇంకా ఎండ పూర్తిగా తగ్గలేదు. వానాకాలం వెనుకబడింది. చలి ముదరకపోయినా, గాలిలో చల్లదనం నాలుగువైపులా వ్యాపించింది.

కృష్ణమ్మని చూస్తే నారాయుడికి అమ్మ గుర్తుకొస్తుంది. ముఖ్యంగా ఇలా ఎండిపోయిన నదిలో అమ్మ రూపమే కనిపిస్తుంది. తన దగ్గర ఏమీలేకపోయినా, ఏదో ఇవ్వాలని తాపత్రయపడుతుంది కొడుకు కోసం.

పొద్దుటి నుంచీ ఏమీ తినలేదు నారాయుడు. అయినా వాడి కడుపులో ఆకలిని మించిన కసి నిండి వుంది. కసితో పసివాడికి కళ్ళలో నీరూరుతోంది.

మళ్ళీ చేతిలో ఉన్న సీసా చూసుకున్నాడు. దాన్నిండా సారా ఉంది. దానికోసమే అసలు గొడవంతా జరిగింది. అమ్మ జ్ఞాపకమొచ్చి మళ్ళీ వాడికి దుఃఖం పెల్లుబికింది.

కళ్ళలో నీరు ఆగటం కష్టమైంది. గొంతులో బాధ గరగరమంటోంది. పొద్దున్న జరిగింది మరచిపోదామనుకున్నా, కుదరటం లేదు.

ఆటో బాబయ్య అనుకోకుండా వూడిపడ్డాడు. వస్తూనే కాస్సేపు కబుర్లు చెప్పి అయ్య చెవిలో - "మంచి సరుకు తెచ్చాను" అంటూ గుసగుసలాడాడు. అంతే... అమ్మ బాబయ్యని నానా తిట్లూ తిట్టింది.

"నా మొగుడే ఇల్లూ, వాకిలీ పట్టక తిరుగుతూ ఉంటే, నువ్వోడివా నాయనా, చాల్లేచాలు" అంటూ బాబయ్యమీద విరుచుకుపడింది. అమ్మ మాటలు బాబయ్య పెద్దగా పట్టించుకోలేదు. నవ్వేసి, సీసా అయ్య చేతిలో పెట్టి, వూర్లో పనిచూసుకు వస్తానని వెళ్ళిపోయాడు. అది గూట్లో పెట్టాడు అయ్య. నారాయుడి చిన్న మనసు కుతకుతలాడిపోయింది. తండ్రి మీద కోపం కట్టలు తెంచుకుంది. రోజూ తప్ప తాగి వస్తూనే ఉంటాడు. అకారణంగా అమ్మని చితక తన్నుతూనే ఉంటాడు. అమ్మ కష్టపడి తెచ్చిన అన్నం తినేసి, నాలుగు తన్నేసి పోతుంటాడు. అలాంటి వేళల్లో తను బిక్క చచ్చి మంచం కింద దూరి, పొట్టలో కాళ్ళు పెట్టుకుని పడుకుంటాడు. అమ్మలేపి అన్నం పెడితే అయిష్టంగానే తింటాడు. అందుకే ఈ రోజు సీసా తీసి దాచేశాడు. ఎవరికీ తెలీనచోట దాచేశాడు. అది అమ్మే దాచిందని అయ్య, అమ్మని చావ చిత క్కొట్టాడు. తను భయంతో బిగుసుకుపోయాడు. తల్లిని ఏదో రక్షించాలని తను చేసింది వక్రించిందని తల్లడిల్లిపోయాడు. ఎవరికంటా పడకుండా సీసా తీసుకు పారిపోయి వచ్చేశాడు.

పొద్దుటి నుంచీ రోడ్లన్నీ తిరిగి తిరిగి కృష్ణ ఒడ్డుకి చేరాడు నారాయుడు. సముద్రం వైపు ప్రవహించే వోపికలేక సగంలోనే ఆగిపోయిన కృష్ణమ్మ కునికిపాట్లు పడుతున్న ట్లుంది.

ఒక్కసారిగా నారాయుడిలో ఆవేశం పొంగింది. కసి చెలరేగింది. అయ్య రోజూ తాగివచ్చి అమ్మని కొడతాడు. అంటే తాగితే బోలెడంత బలం వస్తుందన్నమాట. అయ్య అమ్మని జుట్టుపట్టి కొడుతుంటే మీదికి ఎగిరి తన్నాలనిపిస్తుంది తనకి. కానీ, తను చిన్నవాడు. బలం లేదు. అందులో అయ్య తాగి ఉంటాడు. అందుకే ఈ రోజు ఈ సీసా అంతా తాగేసి, ఇంటికెళ్ళి అయ్యమీదకి ఎగిరి, జుట్టుపట్టుకుని తన బలమంతా పెట్టి తన్నాలి. తనూ తాగితే తనకీ బలమొస్తుందిగా - అందుకే ఈ సీసా-అంతా తాగేస్తాడు తను.

నారాయుడి ఆలోచనలు గతి తప్పి పరుగులు పెడుతూనే ఉన్నాయి. ఒకపక్క భయం, సంకోచం, మరోపక్క కసి, ప్రతీకారం వాడి మనస్సుని ఊపేస్తున్నాయి. నారాయుడు మెట్లు దిగి మెల్లగా ఇసుకలో నడవటం మొదలుపెట్టాడు. ఎంత దూరమో, ఎక్కడికో తెలీని నడక అది. నిర్జనమైన ఆ ప్రదేశంలో నారాయుడి నడక ఎవరిక్కావాలి? నడచి రైలుబ్రిడ్జి కింద స్తంభానికి ఆనుకుని కూర్చున్నాడు.

నెమ్మదిగా సీసా ఎత్తి కొంచెం తాగాడు గొంతు మండిపోయింది. భగ్గున, కడుపులో తిప్పింది. అయినా వాడు ఆగలేదు. తను తాగెయ్యాలి. బలం రావాలి. అయ్యని తన్నాలి. తనంటే అయ్య ఒణికిపోయి అమ్మను కొట్టడం మానెయ్యాలి. అప్పుడే తనకి హాయిగా ఉంటుంది.

మళ్ళీ కాస్త తాగాడు - మళ్ళీ కాస్త - మళ్ళీ కాస్త, నారాయుడు సీసా అంతా తాగేశాడు. భళ్ళున కక్కుకున్నాడు, కళ్ళు తిరిగి తూలిపడ్డాడు. స్తంభం పక్కనే ఇసుకలో ఒరిగాడు. ఏదో రైలు బ్రిడ్జి మీదికి వస్తోంది. కొండలు దొర్లిపస్తున్నట్లు చెవులు హోరెత్తిపోయే శబ్దం.

నారాయుడి కళ్లు మూతలు పడిపోతున్నాయి. అంతలో వాడి ఒళ్ళో ఒక పది పైసల బిళ్ళ పడింది. కళ్ళు తెరిచి బలవంతంగా చూశాడు. రైలు బ్రిడ్జి మీంచి వెళ్ళిపోయింది.

వెలిబూది రాలుతున్నట్లు వెన్నెల ఇసుకంతా పరుచుకుంది. గాలిని చలి గాఢంగా కౌగలించుకుంది. అక్కడక్కడ ఉండే జనం ఎప్పుడో వెళ్ళిపోయారు. ఎవరూ నారాయుణ్ణి చూడలేదు. వాడు ఎవర్నీ చూసే స్థితిలో లేడు.

రాత్రిలోకి సమయం కదులుతూంది. అమాయకమైన పసివాడు మైకంలో పడి ఉన్నాడు. అప్పుడే - సరిగ్గా అదే సమయంలో "యముని మహిషపు లోహ ఘంటలు మబ్బు చాటున ఖణేల్‌మన్నాయ్ - నరక లోకపు జాగిలమ్ములు గొలుసు తెంచుకు ఉరికిపడ్డాయ్"

నీటిని వదిలేముందు నిక్కచ్చిగా కూసే సైరన్ ఘీంకరించింది. మృత్యుదేవత గృహకవాటాలు మృదువుగా తెరుచుకున్నాయ్. కోరల కెరటాలను ముందుకు, మునుముందుకు చాస్తూ - బోనులోంచి తప్పించుకున్న క్రూరమృగంలా ఉరికింది నీరు.

ఏటిగాలి కృష్ణలంకని ఎగిరి ఎగిరికొట్టింది. రాత్రిబిడ్డ ఇంటికి రాలేదని కడుపులో దిగులై కన్నతల్లి కట్ట ఎక్కి చూస్తే, పుడమితల్లికి గుండె చెరువై దిక్కులన్నీ ఒక్కటైనాయి.